
సూర్య
నేటి దినపత్రిక
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 13 సెప్టెంబర్ 2024 | పేజీలు 8

## వైభవంగా దొరసానమ్మ
# గంధమహోత్సవం



8 లో

ఏఎస్‌పేటలోని హబీబా ఖాతూన్ అమ్మవారి (దొరసానమ్మ) 251వ గంధమహోత్సవం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆదేశాల మేరకు దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.

## తెలంగాణ గవర్నర్‌ను కలిసిన సతీష్ రెడ్డి



**నెల్లూరు జడ్పీ, మేజర్ న్యూస్ :** ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ గుండ్రాతి సతీష్ రెడ్డి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రాజుభవన్లో గవర్నమెంట్ కలిసిన సతీష్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో అకడమిక్స్, ఇండస్ట్రీ, స్టార్టప్లలో ఏరోనాటిక్స్, స్పేస్, డిఫెన్స్ టెక్నాలజీల అభివృద్ధిపై చర్చించారు.

## అధైర్య పడవద్దు..
# అండదండగా ఉంటాం !

### రాష్ట్ర మంత్రి ఆనం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అధైర్య పడవద్దు.. పార్టీ, వ్యక్తిగతంగా తాను.. అండగా ఉంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మునగపాటి కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంత సాగరం మండలం చిలకల మర్రి గ్రామానికి గురువారం మంత్రి విచ్చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ మునగపాటి సుబ్బరాజు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీతను ఓదార్చారు. సుబ్బరాజు ఆకస్మిక మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబీకులతో మంత్రి మాట్లాడారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపు కోసం అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని, ఎవరితోనూ ఆ లోటును భర్తీ చేయలేమన్నారు. సోదరి సమానురాలుగా ఉన్న సునీతకు ధైర్యం చెప్పారు. సుబ్బరాజు ఆత్మకు శాంతి కలగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## తట్ట ఇసుక ఎత్తకుండానే..
# రూ.100 కోట్ల అనడానికి సిగ్గుందా..!



- వైసీపీ పాలనలో రైతుల పేరుతో మట్టిని లూటీ చేసిన కాకాణి.. మాపై విమర్శలు చేయడమా !
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోనే అతి తక్కువ డ్రెడ్జింగ్ ధర సర్వేపల్లి నియోజకవర్గంలోని సూరాయపాళెం రీచ్ లోనేనని, తట్ట ఇసుక ఎత్తకుండానే రూ.100 కోట్ల దోపిడీ అనడానికి మాజీ మంత్రి కాకాణికి సిగ్గుందా ! అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇంచార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడుతో కలిసి మండలంలోని సూరాయపాళెం డీసిల్టింగ్ పాయింట్, ఇసుక రేవు, స్టాక్ పాయింట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. సూరాయపాళెంలో ఇసుక అందుబాటులోకి రాకూడదనే కాకాణి కుట్ర పూరిత ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇంట్లో కూర్చుని సోషల్ మీడియా పోస్టులతో ఆరోపణలు చేయడం కాదు.. రీచ్‌లోకి వచ్చి ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. జిల్లాలో సంగం, సూరాయపాళెం, పోతిరెడ్డిపాళెం వద్ద డీసిల్టింగ్ ద్వారా ఇసుక సరఫరాకు నిర్ణయం తీసుకున్నారన్నారు. పడవల ద్వారా డ్రెడ్జింగ్ చేసేందుకు సంగంలో టన్ను ఇసుకకు రూ.140.88 నిర్ణయించగా సూరాయపాళెంలో రూ.128.63గా నిర్ణయించిదన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రేవుల్లోనూ కనిష్ఠంగా రూ.247, గరిష్ఠంగా రూ.278 ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ డ్రెడ్జింగ్ ధర సర్వేపల్లి నియోజకవర్గంలోని సూరాయపాళెం రీచ్‌లోనే తెలిపారు. ప్రభుత్వం అలా నిర్ణయం తీసుకుందో, లేదో ఇక్కడ తోడేరు రెడ్డి రూ.100 కోట్లు.. రూ.100 కోట్లు అంటూ -మిగతా 2లో



## ఇసుక దొంగ సోమిరెడ్డీ..
### నాటకాలు కట్టిపెట్టు !

2 లో



సూరాయపాళెం రీచ్‌లో సోమిరెడ్డి అనుచరుల ఆగడాలకు దౌర్జన్యాలకు చెందిన ఆధారాలు.. ఫోటోలు, వీడియోలను ప్రదర్శించిన కాకాణి గోవర్ధన రెడ్డి

## 17 నుంచి
# 'స్వచ్ఛత హీ' సేవ



రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు.

లోపల పేజీలో

- దళితుల ఆందోళన

# గొడ్డును కొట్టినట్టు కొడతారా !



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద దళితులు తీవ్ర ఆందోళన చేపట్టారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం సీఐ, ముత్తుకూరు ఎస్ఐలు, తమ పిల్లల్ని తీసుకొచ్చి అకారణంగా కొట్టారని తల్లిదండ్రులు తీవ్రంగా మండిపడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు పలువురి దళితులను కొట్టిన అనంతరం వెంకటాచలం ఆరోగ్య కేంద్రానికి మెడికల్ చెక్ అప్ నిమిత్తం తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో వారి తల్లిదండ్రులు పిల్లలను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, ఆ నలుగురి ఒంటిమీద తీవ్రమైన రక్త గాయాలు వాతలు చూసి మా బిడ్డలను గొడ్డులను కొట్టినట్టు కొట్టారని తల్లిదండ్రులు ఆరోగ్య కేంద్రం వద్దనే నిరసన ఆందోళన చేపట్టారు. ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డిని, కానిస్టేబుల్ సుమన్ సస్పెండ్ చేయాలని, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు సద్వినియోగం చేసుకోండి

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి

- ఇందుకూరుపేటలో 3 రోజులుగా కొనసాగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్స్
- పింక్ బస్ సేవలో మరో అయిదు రోజులు అందుబాటులో
- క్యాన్సర్ రహిత కోవూరులో భాగస్వాములు కండి

2 లో



# ఇసుక దొంగ సోమిరెడ్డీ.. నాటకాలు కట్టిపెట్టు !



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇసుక దొంగ సోమిరెడ్డీ.. నీ నాటకాలు కట్టిపెట్టు అంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి మండిపడ్డారు. గురువారం నగరంలో డైకస్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు, యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పారు.. కానీ గతంలో కంటే ఐదు రేట్లు అధికంగా ధరను ఇసుకకు చెల్లించాల్సి వస్తోందన్నారు. పేద వాడికి ఇసుక అందనివ్వకుండా టీడీపీ కూటమి నేతలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మండలంలోని సూరాయపాళెంలో సోమిరెడ్డి రూ.100 కోట్లకు స్కెచ్ వేశాడన్నారు. కొంతమంది తోడుదొంగలు.. చిల్లర దొంగలతో సోమిరెడ్డి సూరాయపాళెంకు వెళ్లాడన్నారు. వీరితోపాటు డూప్ షాట్ శ్రీధర్ రెడ్డిని కూడా తీసుకెళ్లాడు.. ఆయన వద్ద ఏదేదో మాట్లాడించేందుకు ప్రయత్నించాడన్నారు. వీళ్ళు ఎందుకు అక్కడికి వెళ్లారు.. ఏమి చూశారని ప్రశ్నించారు. కేవలం ఒకరి భుజాలు ఒకరు తట్టుకొని వచ్చారన్నారు. అధికారుల సమక్షంలో ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటే అక్కడ ఏమి జరుగుతుందో తెలుస్తుందన్నారు. అప్పుడు సోమిరెడ్డి చేస్తున్న దోపిడీ కూడా వెలుగులోకి వస్తుందన్నారు. పెన్నానదిలో ఇసుకను డ్రెడ్జింగ్ చేసి యార్డ్‌కు తరలించేందుకు కలెక్టర్ టెండర్లు ఆహ్వానించారని, టెండర్లు దక్కించుకున్న వారి బోట్లను నదిలోకి సోమిరెడ్డి దిగనివ్వడం లేదన్నారు. కలెక్టర్‌తో పాటు, ఇతర అధికారులను సోమిరెడ్డి అనుచరులు తీవ్రంగా విమర్శించారన్నారు. పేరుకు డ్రెడ్జింగ్ చేసినట్లు చెప్పి, చుట్టు పక్కల రీచ్‌లలో ఇసుక నిల్వలను ఎత్తేయాలని ప్లాన్ వేశాడని, వారితో బేరసారాలకు దిగారన్నారు. అధికారులను కూడా రీచ్ వద్దకు తీసుకొస్తే, నేను వస్తానని, అక్రమాలకు స్కెచ్ వేశారా.. లేదా.. అనేది నిరూపిస్తా అన్నారు. వైసీపీ హయాంలో సూరాయపాళెంలో గత మూడేళ్లుగా ఇసుక రీచ్‌లు నిర్వహించలేదని, దమ్ముంటే కాదని నిరూపించాలని సవాల్ విసిరారు. సూరాయపాళెంలో సోమిరెడ్డి దోపిడి గురించి శ్రీధర్ రెడ్డికి ఏం తెలుసని అక్కడికి వెళ్ళాడన్నారు. శ్రీధర్ రెడ్డి డూప్ షాట్‌లను నేను చిన్నప్పటి నుంచి చూశానని, ఎవరైనా వ్యాపారస్తులు.. లే అవుట్ యజమానులు ఉంటే, వారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉంటారన్నారు. నా దగ్గరికి అలాంటి వాళ్ళు రారని, ఎవరైనా సమస్యలు ఉండే ప్రజలు మాత్రమే వస్తారన్నారు. భవిష్యత్తులో తన దోపిడీకి సోమిరెడ్డి సహకారం అందిస్తారని శ్రీధర్ రెడ్డి వెళ్లాడా.. మీరు వెళ్ళి, మీ అంతకు మీరు క్లీన్ చిట్ ఇచ్చుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. పొదలకూరులో అక్రమ లేఔట్లు అని చెప్పిన సోమిరెడ్డి.. రూ.3 కోట్లు దండుకొని ఇప్పుడు వాటిని సక్రమం చేశాడా.. అక్రమ లేఔట్లని ఆరోపించిన సోమిరెడ్డి, సక్రమం ఎలా చేశాడో సోమిరెడ్డి చెప్పాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారని, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారా..! ఇది కాదా దోపిడీ అన్నారు. ఒకవైపు ఇసుక లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతుంటే, టీడీపీ నేతలు బ్లాక్‌లో విక్రయిస్తున్నారన్నారు. అంతేకాకుండా సర్వేపల్లిలో పోస్టుల అమ్మకాలను సోమిరెడ్డి జోరుగా కొనసాగిస్తున్నాడన్నారు. సోమిరెడ్డి పెద్ద పోస్టుకు ఒక ధర నిర్ణయించి డబ్బులు వసూలు చేసుకొని లెటర్లు జారీ చేస్తున్నాడన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమిలో భాగస్వామి పార్టీ అయినా వెంకటాచలం బీజేపీ కార్యదర్శి పిల్లిపోగు పెంచలయ్య దగ్గర ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు సోమిరెడ్డి మూడు లక్షలు డిమాండ్ చేశాడన్న ఆరోపణకు మీ సమాధానం ఏంటో చెప్పాలన్నారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన లెటర్లను కూడా సోమిరెడ్డి అమ్ముకుంటున్నారన్నారు. సోమిరెడ్డి దోపిడీని ఎదుర్కొంటామని, అక్రమాలను సహించమన్నారు. సోమిరెడ్డి పిల్లి శాపాలకు.. ఉడుత బెదిరింపులకు భయపడం అని మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు.

## తట్ట ఇసుక ఎత్తకుండానే.. రూ.100 కోట్ల దోపిడీ అనడానికి సిగ్గుందా !

*(మొదటి పేజీ తరువాయి)*


కేకలు మొదలుపెట్టాడన్నారు. ఒక్క తట్ట ఇసుక బయటకు తోలకుండానే దోపిడీ అని చెప్పేందుకు సిగ్గు, శరం లేవా ! ఘాటుగా విమర్శించారు. ఆయన మాదిరిగా మేము అడ్డదారులు తొక్కతామనే భ్రమతో కేకలు పెడుతున్నాడన్నారు. మూడు పూట్లా తిని బలవడం.. ఒంటికి పట్టిన కొవ్వును తీయించుకునేందుకు బేరియాట్రిక్ సర్జరీలు చేయించుకోవడం.. మళ్లీ ఆ కరోనా ప్యాలెస్‌లో కూర్చుని కూతలు కూస్తూ గడపడమే కాకాణికి తెలుసునన్నారు. వైసీపీ పాలనలో ఇదే సూరాయపాళెం, విరువూరు రీచ్‌ల నుంచి కోట్లాది రూపాయల విలువైన ఇసుకను కొల్లగొట్టారని ఎద్దేవా చేశారు. కనుపూరు చెరువు నుంచి రైతుల పేరుతో రూ.1 లెక్కన 2.40 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి నెల్లూరు చుట్టుపక్కల లేఅవుట్లకు అమ్ముకున్నాడని ఆరోపణలు చేశారు. అనుమతులు తీసుకున్నది 2.40 లక్షల క్యూబిక్ మీటర్లకు అయితే తోలింది 15 లక్షల క్యూబిక్ మీటర్లకు పైనే విమర్శించారు. మాజీ మంత్రి కాకాణి నిబంధనల ప్రకారం క్యూబిక్ మీటరుకు రూ.231 చెల్లించకుండా రూపాయి జీఓ అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయలు దోచేశాడని తెలిపారు. సర్వేపల్లి రిజర్వాయర్‌తో పాటు మిగిలిన చెరువులనూ వదిలి పెట్టకుండా మొత్తం 5.75 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తేసి లేఅవుట్లకు అమ్మేసుకున్నాడని వెల్లడించారు. ఒక్క ట్రక్కు మట్టి కూడా రైతుల పొలంలోకి చేరలేదన్నారు. ఈ మట్టికి రూ.231 లెక్కన కడితే రూ.14 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. కాకాణి అధికారికంగా, అనధికారికంగా తోలిన మొత్తం 20 లక్షల క్యూబిక్ మీటర్లకు నిబంధనల ప్రకారం దాదాపు రూ.46 కోట్లు ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగ్గొట్టాడన్నారు. అప్పట్లో మా కుటుంబానికి విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయని నా ఇమేజ్ భారీ స్థాయిలో పెంచాడని, ఇప్పుడేమో సడెన్ గా రూ.100 కోట్ల రేంజ్‌కి దించేశాడని, ఏళ్లు గడుస్తున్నా ఆ విదేశాల్లోని ఆస్తులను చూపించడంలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి 13 కేసుల హియరింగ్ మొదలైతే ఆయనకు ఇంటికి పోయేందుకు కూడా తీరిక దొరకదన్నారు. కాకాణిది అసలు నోరా..తాటి మట్టా అన్నారు. సూరాయపాళెం రీచ్‌లో అసలు ఇసుక తోలకాలే ప్రారంభం కాలేదని, ఒక్క ట్రాక్టర్ కాదు కదా, ఇసుక రేణువైనా ఎత్తినట్టు వచ్చి చూపించమని సవాల్ విసిరాం.. కానీ ఆయనకు ఆ దమ్ము లేదన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ డ్రెడ్జింగ్ ధరతో ప్రారంభమవుతున్న ఇసుక రీచ్ జరగకూడదనే కుట్రతోనే కాకాణి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## 17 నుంచి 'స్వచ్ఛత హీ' సేవ




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు గ్రామాలో, పట్టణాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై ర్యాలీలు,సదస్సులు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను గ్రామస్థాయిలో భాగస్వాములుగా చేయాలన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించిన అధికారులకు, కార్మికులకు అక్టోబర్ 2 సత్కారాలు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మురుగుకాలు శుభ్రం చేయాలన్నారు. గ్రామపంచాయతీలో వ్యర్థ పదార్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. త్రాగునీటి చెరువులను, తాగునీటి పథకాలను శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని ఆయన చెప్పారు. అలాగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో ప్రభుత్వ కార్యాలయాలల్లో, జాతీయ రహదారులు, రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నెల్లూరు కలెక్టరేట్ నుండివీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌తో పాటు డీపీఓ సుస్మితా, జెడ్పీ సీఇఓ కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డిని కలిసిన వైసీపీ నేతలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా వైసీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకుర్తి రవి, ఇందిరమ్మ కాలనీకి చెందిన వైసీపీ నేత శంకర్ రెడ్డి గురువారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలతో సత్కరించి టీడీపీలో చేరుతామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని కలిసి మాట్లాడారు.

# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు సద్వినియోగం చేసుకోండి

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి






**విడవలూరు, మేజర్‌న్యూస్ :** క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడానికి మహిళలు స్వచ్ఛందంగా తరలి వస్తున్న తీరు చూస్తుంటే తాను ఆశించిన క్యాన్సర్ రహిత కోవూరు త్వరలో సాకారం అవుతోందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గత మూడు రోజులుగా ఇందుకూరు పేట గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గురువారం సందర్శించారు. కాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవడానికి వచ్చిన మహిళతో మాట్లాడారు. వీలైనంత ఎక్కువ మంది స్క్రీనింగ్ చేసుకునేలా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని స్థానిక వైద్య సిబ్బందిని కోరారు. స్వచ్ఛందంగా వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయించు కుంటున్న మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. ఇందుకూరు పేట మండలంలో గత మూడు రోజులుగా 218 మంది క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించు కున్నారని తెలిపారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అయినప్పటికీ ప్రాథమిక దశలో రోగ లక్షణాలను గుర్తించి సకాలంలో వైద్యమందిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చున్నారు. తాను ఊహించిన దానికన్నా ఎక్కువ మంది స్క్రీనింగ్ చేయించుకోవడానికి ముందుకు వచ్చి కోవూరు ప్రజలు చైతన్యవంతులని మరోసారి నిరూపించుకున్నారని ప్రశంసించారు. పింక్ బస్ మరో అయిదు రోజులు ఇందుకూరు పేటలోని ఉంటుందని ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు :**

క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ క్యాంప్ విజయవంతం చేయడంలో సహకరిస్తున్న స్విమ్స్ వైద్య బృందం, స్థానిక మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, స్థానిక నాయకులను ఆమె కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, ఇంతియాజ్, పవన్ రెడ్డి, బెజవాడ వంశీరెడ్డి, వీరేంద్ర చౌదరి, కైలాసం ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సంపూర్ణ ఆహారం తీసుకుంటే సర్వదా ప్రయోజనం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న రత్నమ్మ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిళలు, ప్రధానంగా గర్భిణీలు, బాలింతలు సంపూర్ణ ఆహారం తీసుకుంటే వారికి అన్నివిదాలా ప్రయోజనకరం, ఆరోగ్యవంతమని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ పేర్కొన్నారు. ఐసిడిఎస్ సిడిపివో పిసునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ రత్నమ్మ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్ఆర్‌పల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌మహా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార అవగాహనా ర్యాలీ, సదస్సును నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసి ప్రదర్శించిన పౌష్టికాహార పధార్థాల ప్రదర్శనను ఆమె పరిశీలించి వాటిని గురించి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ఈసందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటుచేసిన సదస్సులో రత్నమ్మ ప్రసంగిస్తూ చిరుధాన్యాల్లో శక్తివంతమైన విటమిన్లు ఉంటాయని, బలవర్ధక ఆహారమవుతుందని, చిరుధాన్యాలను వంటచేసుకొని భుజించాలని ఆమె సూచించారు. సంపూర్ణ ఆహారమంటే ఏమిటనే అంశం గురించి ఆమె వివరించి అవగాహన కల్పించారు. పిండిపధార్థాలు, మాంసకృత్తులు, నూనెలు, పాలు, గ్రుడ్లు, మాంసం, ఆకుకూరలు తదితరాల్లో ఎలాంటి విటమిన్లుంటాయి, ఏవిధంగా గర్భిణీలు, బాలింతలకు రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రయోజనం కల్గిస్తాయనే అంశాలను గురించి రత్నమ్మ సవివరాంగా తెలిపి అవగాహన కల్పించారు. మహిళలు గర్భిణీగా ఉన్న సమయంలో, ప్రసవానంతరం బాలింతగా ఉన్న సమయంలో రక్తహీనతకు గురికాకుండేలా ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం సమకూరుస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా వారే వినియోగించుకోవాలని, వాటితో పాటు తాము వివరించిన పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలని ఆమె సూచించారు. చిరుధాన్యాల్లో ఎలాంటి పోషకవిలువలుంటాయనే అంశంగురించి వివరించామని, అందరూ అవగాహన పెంపొందించి అనుసరించాలని ఆమె కోరారు. పౌష్టికాహారం, ప్రయోజనం తదితర అంశాలగురించి వివరించారు. ఈకార్యక్రమంలో మెప్మా సివో జి.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీలా, మెప్మా సభ్యులైన మహిళలు, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, అంగన్‌వాడీ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజికచైతన్యం-పోషణ్ మహా లక్ష్యం : సూపర్‌వైజర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలోని మహిళలు, ప్రధానంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన పెంపొదించి వారిలో చైతన్యం తేవాలన్నదే పోషణ్‌మహా కార్యక్రమ లక్ష్యమని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాల అవగాహనా సదస్సును గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రూపొందించి ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె పరిశీలించి వాటి గురించి గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ప్రసంగిస్తూ గర్భిణీలు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండేలా వారికి పోషకవిలువల ఆహారం అత్యంత అనివార్యమన్నారు. అందుకే ప్రభుత్వం వారికి అవసరమైన పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమకూరుస్తుందన్నారు. అయితే ఈ పౌష్టికాహారంతోపాటు తమకు అందుబాటులో స్వల్ప వ్యయంతో లభించే పలు ఆకుకూరలు, కూరగాయలు, వేరుశెనగపప్పులు తదితర అపరాలను ఆహారంగా తయారుచేసుకొని భుజిస్తే మరింత ఆరోగ్యవంతంగా ఉంటారని, పుట్టే బిడ్డలకు సమృద్ధిగా పాలు లభిస్తాయని, వారు కూడా ఆరోగ్యంగా రక్తహీనత లేకుండా ఉండగలరని ఆమె పేర్కొన్నారు. అందరూ పౌష్టికాహార పధార్థాల పట్ల, వాటి ఆవశ్యకతపట్ల తగిన అవగాహన పొందాలన్న లక్ష్యంగా తమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిఏటా పౌష్టికాహార వారోత్సవాలు, మాసోత్సవాలు నిర్వహిస్తుంటామని, నిత్యం తమకు అందుబాటులో ఉంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా అవగాహన కల్పిస్తుంటారని నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. ఆరోగ్యం పట్ల గర్భిణీలు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు, మెళుకువలు పాటించాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ రత్నమ్మతోపాటు ఎంఎల్‌హెచ్‌పి ప్రశాంతి, ఏఎన్ఎం రమణమ్మ, ఆశాకార్యకర్త పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.శ్రీదేవి, డి.తిరుపతమ్మ, ఐ.భారతి, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, అంగన్‌వాడీ చిన్నారులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు నిత్యవసర సరుకులు సహాయార్ధం



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల విజయవాడలో జరిగిన వరద ముంపు ప్రాంతాల వారికి కావలి ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు బల్సా ప్రసాద్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను సమకూర్చారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి సహాయం అందించడానికి కిరాణా మర్చంట్ అసోసియేషన్ ముందుకు రావడం జరిగింది. అనంతరం బల్సా ప్రసాద్ మాట్లాడుతూ.. కావలి కిరాణా మర్చంట్ అసోసియేషన్ తరపున నిత్యవసర సరుకులైన కందిపప్పు, మినపప్పు, బియ్యం ఇతర వస్తువులను సమకూర్చి విజయవాడ వరద బాధితులకు అందిస్తున్నట్లు బాల్స ప్రసాద్ తెలిపారు. నిత్యవసర సరుకుల సమకూర్చేందుకు మాకు సహకరించిన మునగనూరు తిరుపాలు, ఓరుగంటి సుబ్బరాయుడు, చల్ల మధుసూదన్రావు, శెట్టి శ్రీకాంత్, నేరెళ్ల సాయి మనోజ్, మద్దుల రామకృష్ణ, ఏల్చూరి శ్రీనివాసులు, వాకాటి శ్రీనివాసులు, సత్యనారాయణ, కనుమరులపూడి శరత్, ఇలేంద్ర దీపక్, నేరెళ్ల కృష్ణ కిషోర్ గాదంశెట్టి వంశీకృష్ణ, గాదంశెట్టి అల్లూరయ్య, కంకణాల భార్గవ్, కలిసేటి మనోజ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు సాయమందించిన
# విశ్రాంతి ఉపాధ్యాయులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక బుడంగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చదువుచున్న పేద విద్యార్థులకు వారి యూనిఫామ్ కుట్టించడానికి, వారికి కావలసిన స్టేషనరీస్మెంట్‌కు ఆర్థిక సహాయ సహకారాలు విశ్రాంతి ఉపాధ్యాయులు చిల్లర సుధాకర్, షేక్ జిలాని భాష, కుమ్మర కొండూరు అసిస్టెంట్ ఎం.మహేశ్వర శర్మ వారు ఆర్థిక ఇతర సహాయ సహకారాలు అందించారు. బుడమగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో ప్రస్తుతం పనిచేయుచున్న ఉపాధ్యాయులు జీ.వి రామారావు, మరి ఐహెచ్ఎల్. ప్రసాదు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలా ప్రతి పాఠశాలలో ఉన్న విద్యార్థులకు వీలైనంతవరకు సహాయ సహకారాలు అందిస్తే బాగుంటుందని వారు తెలిపారు.

# మహిమలూరులో అగ్నిప్రమాదం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మహిమలూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కొంతకాలంగా నిల్వఉన్న ఫైబర్‌నెట్ కేబుల్స్‌కు గురువారం అగ్నిపమాదం సంభవించింది. ప్రమాదానికి కారణాలు తెలియడంలేదంటున్నారు. మంటలు రేగి కేబుల్స్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదసంఘటనా సమాచారం అందుకున్న ఆత్మకూరు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది వచ్చి మంటలనార్పారు. దాదాపు లక్షరూపాయల నష్టం వాటిల్లిందని చెబుతున్నారు.

# బలమైన ఆహారం బిడ్డకు శ్రేష్కరం

▶ అడిషనల్ సిడిపిఓ రాజ్యలక్ష్మి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బలమైన ఆహారం బిడ్డకు శ్రేయస్కరమని ఇందుకూరుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు అడిషనల్ సిడిపిఓ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం మామిడిపూడి అంగన్వాడి కేంద్రాల్లో ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ మంజులమ్మ తో పాటు బాలింతలు గర్భవతులు హాజరయ్యారు. అంగన్వాడి వర్కర్స్ పావని, లక్ష్మి కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపివో మాట్లాడారు. ప్రతి నెల ప్రభుత్వం ఇస్తున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో సరుకులు ఇస్తున్నామని తెలిపారు. ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు ఆహారంగా తీసుకోవాలని సిడిపిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక వెంగళరావు నగర్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల నందు గురువారం ప్రకాష్ కావలసిన ఆధ్వర్యంలో ఎన్సిసి క్యాండెట్స్‌కి రక్తపు నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హయుల్ హయ్యం మాట్లాడుతూ.. అందరూ తప్పనిసరిగా వారి రక్త నమూనాను తెలుసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే రక్తం కావాలన్నా ఇంకొకరికి రక్తదానం చేయాలి అన్న తప్పనిసరిగా రక్త గ్రూపు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్సిసి ఆఫీసర్ తిప్పారెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ.. 2024వ సంవత్సరం ఎన్సీసీ ఎంపికలో 60 మంది విద్యార్థులను ఎన్‌సీసీలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలు ఉన్నతమైనవని ఎప్పుడు అందుబాటులో ఉండి నిరంతరం సేవలు అందిస్తారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్ఎంసి చైర్మన్ వైరింగ్గం కల్లయ్య 18వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ శానం హరి మరొకసారి వారి గ్రూపులో కూడా నిర్ధారణ చేసుకున్నారు. జీవశాస్త్ర అధ్యాపకులు అంజాద్ క్యాండేట్స్‌కు రక్త గ్రూపులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది సిహెచ్. వెంకటేశ్వర్లు, జై.శేషమ్మ, ఐ.అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సచివాలయానికి సీఎం చిత్రపటాలు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామ సచివాలయానికి తెలుగు యువత నాయకులు పి.అంజి, కందే సునీల్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చిత్రపటాలను గురువారం సచివాలయ అధికారులకు బహుకరించారు. ఈ సందర్భంగా పి.అంజి, కందే సునీల్ మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తున్నారని, అందుకు నిదర్శనం విజయవాడ వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడమేనన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను అమలుచేసి సంక్షేమాన్ని అందించడంతోపాటు, ఆంధ్రుల కల అయినటువంటి ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరాన్ని ఈ ప్రభుత్వంలోనే పూర్తి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కందే రవికుమార్, పట్నం పెంచలయ్య, గంగనబోయిన వెంకటేశ్వర్లు, గోగుల దయాకర్, ఓ.పెంచలయ్య సచివాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి మరణం పై ఎమ్మెల్యే సోమిరెడ్డి దిగ్భ్రాంతి

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గురువారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల విచారణ వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. నిరంతరం ప్రజా ఉద్యమాల్లో గడిపిన సీతారాం కానరాని లోకాలకు చేరడం బాధాకరమైన అంశమని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. 1974 సంవత్సరంలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఎటువంటి చెడ్డ పేరు లేకుండా గుర్తింపు పొందారని ఎమ్మెల్యే తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా ప్రజల సమస్యలపై పోరాటం చేశారని ప్రజావాణి వినిపించిన నాయకుడు సీతారాం అన్నారు. జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన గొప్ప ప్రజా నాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఆయన ఒక్కడే అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# బూడిదగుంట చెరువు బాధిత రైతుల సర్వేలో అవకతవకలు

## ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుకు పోరాట కమిటీ వినతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం బూడిదగుంట చెరువు కట్ట తెగిపోయిన సందర్భంలో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించే ప్రక్రియలో సంబంధిత శాఖ అధికారులు చేసిన సర్వేలో అవకతవకలు ఉన్నాయని అసలైన రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ యాష్ పాండ్ బాధిత పోరాట కమిటీ ఏపీ జెన్కో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు తెలియజేసింది. గురువారం పోరాట కమిటీ నాయకులు హైకోర్టు న్యాయవాది విజయ నిర్మల సమక్షంలో చీఫ్ ఇంజనీర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కమిటీ సభ్యులు అంకయ్య, శ్రీనివాసులు, జయరామయ్య, నరసింహ, సుధాకర్, మరి కొంతమంది కలిసారు. అధికారులు సర్వే తప్పులు తడక అని విమర్శించారు. సర్వే సక్రమంగా చేయకపోవడం వల్ల నష్టపోయిన రైతులు పేర్లు జాబితాలో లేకుండా పోయాయని వెంటనే రీ సర్వే చేయాలని పోరాట కమిటీ డిమాండ్ చేసింది. సర్వే చేస్తూ అర్హులైన రైతులను గుర్తించి ఎకరాకు మూడు లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. అసలైన రైతులకు అన్యాయం జరగనివ్వమని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాగమ్మ కాలనీలో కాలవ పూడిక తీసివేత



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సూచనల మేరకు బుజబుజ నెల్లూరు 25వ డివిజన్ ఇన్‌చార్జ్, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ఆధ్వర్యంలో నాగమ్మ కాలనీలో రాబోయే వర్షాకాలం కారణంగా మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తను యంత్రాల ద్వారా తీసివేశారు. అదేవిధంగా కాలవలో చుట్టుపక్కల, ఇళ్ల మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అదేవిధంగా ఇళ్ల మధ్యలో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు 63వ బూత్ కన్వీనర్ మోటుపల్లి బాలకృష్ణ యాదవ్, 66వ బూత్ కన్వీనర్ కొత్త చిన్న ఆంజనేయులు, 64వ బూత్ కన్వీనర్ ఎద్దల ప్రసాద్, జానకిరామ్ రెడ్డి, సచివాలయ శానిటరీ సెక్రటరీ వినూషా, డివిజన్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల పరిశీలన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణం డిగ్రీ కళాశాల సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఒకరి బదులు మరొకరు పనులకు హాజరు కాకూడదన్నారు. సిబ్బంది పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలన్నారు. అనంతరం జాబ్ కార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అం దజేశారు.

# తుమ్మగుంటలో పౌష్టికాహార మహోత్సవాలు



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని దంపూరు సచివాలయం పరిధిలోని తుమ్మగుంట ఎస్టీ కాలనీలో అంగన్వాడి కేంద్రం నందు గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పి.సుమిత్ర పాల్గొని మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యతను గురించి తల్లులకి వివరించారు. ఆకుకూ రలు, పౌష్టికాహారం వస్తువుల గురించి చెప్పారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని ఆమె కోరారు. భవిష్యత్తులో వ్యాధి నిరోధక శక్తి వల్ల జబ్బులు బారిన పడకుండా ఉంటారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఏఎన్ఎంలు సంపూర్ణమ్మ, అంగ న్వాడీ టీచర్‌లు కవిత, రాజేశ్వరి, ఆయా ఎస్తేరమ్మ తల్లులు పాల్గొన్నారు.

# ఆత్మకూరుకు డిగ్రీకాలేజి మంజూరు అటకెక్కిందా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరుకు ఒక ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుచేయాలని పలువురు అధ్యాపకులు, విద్యావేత్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, తదితరులు కోరడం, ఆమేరకు అభిప్రాయ సేకరణ జరగడం, ఇదిగో అదిగో మంజూరు అంటూ ప్రచారం సాగినా ఇప్పటివరకు అతీగతీ లేనందున ఈఅంశం అటకెక్కిందా అనే సందేహం పలువురులో వ్యక్తమవుతోంది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక ప్రభుత్వ డిగ్రీకాలేజి ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి యోచన మేరకు గతంలో దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతంరెడ్డి వద్ద స్థానిక మున్సిపల్ వైస్‌చైర్మెన్, అభిరామ్ హాస్పిటల్ ఎం.డి.డాక్టర్ కె.వి.శ్రావణ్ కుమార్‌రెడ్డి ప్రతిపాదించగా ఆమేరకు గౌతంరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ఈవిషయమై ఏడాదిన్నర క్రితం ఆత్మకూరులో అభిప్రాయ సేకరణకు నెల్లూరు డికెడబ్ల్యుకాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరి బృందం పర్యటించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పలువురు ప్రముఖులనుండి వారు అభిప్రాయసేకరణ గావించారు. స్థానిక డాక్టర్ ఎస్‌ఆర్‌జె డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కె.వి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కె.వి.శేషారెడ్డి, నందా ఓబులేశు, పీపుల్స్‌ఫోరమ్ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వర్లురెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, ఎల్‌ఆర్‌పల్లి జెడ్పిహైస్కూల్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ సోమా వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్, జనవిజ్ఞానవేదిన నాయకుడు లక్కు కృష్ణప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఆర్‌జె కాలేజి లెక్చరర్ టి.శ్రీనివాసులురెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆత్మకూరు డివిజన్ మెట్టప్రాంతమని, ఇక్కడ పేదల అభ్యాసానికి ప్రభుత్వం డిగ్రీకాలేజి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రభుత్వకాలేజి అయితే విద్యార్థులకు భరోసా ఉంటుందన్నారు. ఇక్కడ డిగ్రీకాలేజి ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయని, ప్రజాసంఘాల సహకారం ఉంటుందని, డివిజన్‌లో 22జూనియర్ కాలేజిలుండగా అందులో నాలుగుమాత్రమే ప్రభుత్వానివని, 10 డిగ్రీ కాలేజిలుండగా


అభిప్రాయసేకరణలో అధ్యాపకులు,విద్యావేత్తలు (ఫైల్‌ఫోటో)

ప్రభుత్వ కాలేజిలు లేవని వారు పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ అభ్యశించేందుకు ప్రభుత్వ కాలేజి ఆవశ్యకమని, అయితే నేటి ఆధునిక పరిస్థితులకనుగుణంగా వృత్తివిద్యాకోర్సులు, కంప్యూటర్ కోర్సులు, అన్నీ మౌళికవసతులు, అనుబంధ హాస్టల్, అన్నీ సౌకర్యాలు, సంపూర్ణంగా అధ్యాపకులు, సిబ్బంది ఉండేలా చేస్తే ఎంతో ప్రయోజనకరమని వారు పేర్కొన్నారు. మొత్తంమీద అందరూ ముక్తకంఠంతో ఆత్మకూరులో ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుచేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా అభిప్రాయసేకరణ గావించిన డాక్టర్ గిరి మాట్లాడుతూ.. అందరూ ప్రభుత్వ డిగ్రీకాలేజి ఏర్పాటును స్వాగతిస్తున్నారని, ఇదే నివేదికను తాను ప్రభుత్వానికి అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డికెడబ్ల్యుకాలేజి లెక్చరర్ నారాయణరెడ్డి, ఏవో సుధాకర్, పలువురు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గన్నారు. అప్పట్లో ఆత్మకూరుకు ప్రభుత్వ డిగ్రీకాలేజి మంజూరుకానుందన్న ప్రచారం ముమ్మరంగా సాగింది. తీరా చూస్తే ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు అందకపోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కినట్లేనా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి నూతన ప్రభుత్వం స్పందిస్తుందేమో చూడాల్సి ఉంది.


# కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సలను పర్మినెంట్ చేయండి : సీఐటీయు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఏరియా వైద్యశాలలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు తమ విధులు నిర్వహిస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని గురువారం నిరసన తెలిపారు. ఈ నిరసనకు సీఐటీయు నాయకులు మద్దతు తెలిపి అనంతరం నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ.. ఏరియా వైద్యశాలలో సుమారు 15 సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా నిధులు నిర్వహిస్తున్నారని మీరు పగలు, రాత్రి ప్రజలకు సేవ చేస్తున్నారని ప్రభుత్వానికి కూడా వారి అంది తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. అలాగే కరోనా కష్టకాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి నర్సులు ప్రజలకు అందించిన సేవలను జ్ఞాపకం చేసుకొని వారిని పర్మినెంట్ చేస్తారని ఆశతో నర్సులు ఎదురు చూస్తున్నారని ఆశలు నిరాశలుగా మిగిలాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ ముఖ్యమంత్రి వీరి సేవలను గుర్తించి కాంటాక్ట్ స్టాఫ్ నర్సులను అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటి నాయకులు స్టాఫ్ నర్స్ ఎస్కే. నూర్జహాన్, రాజ్యలక్ష్మి, స్వాతి రాధిక, కళ్యాణి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# శబరిమల అయ్యప్ప సేవా సమాజం దాతృత్వం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** శబరిమల అయ్యప్ప సేవా సమాజం సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గురువారం నెల్లూరు- తిరుపతి జిల్లాల పరిధిలోని సమాజం నిర్వహకులు కేరళ రాష్ట్రంలోని శబరిమల సన్నిధానంకు అయ్యప్ప భక్తులకు అన్నదానాన్ని నిర్వహించేందుకు సహకారం ఇచ్చింది. దాతల నుండి వసూలు చేసిన సుమారు లక్ష యాభై వేల రూపాయలు విలువ కలిగిన సామాగ్రిని అక్కడికి పంపింది. ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి పూజా కార్యక్రమం నిర్వహించి సామగ్రితో నిండుకున్న వాహనాన్ని శబరిమలకు పంపారు.గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదురు రామ్మోహన్ రెడ్డి జెండా ఊపి వాహనాన్ని ముందుకు కదిలించారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకయ్య, జిల్లా అధ్యక్షులు బూతు



రాజ, ప్రధాన కార్యదర్శి పేట విజయ శేఖర్ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ముత్యాలయ్య, బి.గోవిందయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను అధిగమించాలి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అతిథిగృహంలో పక్కాగృహాల నిర్మాణాలపై మండలస్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్‌ఫెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్చి చివరినాటికి పక్కాగృహాల నిర్మాణాలను లబ్దిదారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టలన్నారు. ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారుడికి అందాల్సిన 90రోజుల పని దినాల నిధులను త్వరితగతిన అందించాలన్నారు. వెలుగు ద్వారా లబ్దిదారులకు రుణం అందించి ఆర్థిక తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం ఖాజారంతుల్లా, వర్క్ఇనస్పెక్టర్లు హర్షవర్ధన్ రె డ్డి, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో శారీరక దృఢత్వం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** ప్రతిరోజు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శారీరిక దృఢత్వం లభిస్తుందని అంగన్వాడీ సూపర్వైజర్ రమణి అన్నారు. మండలంలోని రామచంద్రపురం క్లస్టర్ పరిధిలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతలు గర్భిణీలు క్రమం తప్పకుండా ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా పాలు గుడ్లు కూరగాయలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులతోపాటు బాలింతలు గర్భిణీలకు కూడా పౌష్టికాహార కిట్లను అందజేయడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆదిశేషమ్మ, మంగమ్మ, సువార్తమ్మ, రుతమ్మ, మాధవి, గంగమ్మ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర స్వామి దేవస్థానానికి 25ఏళ్లు పూర్తి

- స్వామి వారికీ మహాకుంభాభిషేకం




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నిర్మించి ఇరవై ఐదు వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా స్వామి వారికీ మహాకుంభాభిషేకం నిర్వహించారు. నగరంలోని గాంధీ బొమ్మ శివాజీ సెంటర్లో ఉన్న సిద్ది విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నిర్మించి ఇరవై ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న శుభసందర్బంగా గురువారం స్వామి వారికీ మహాకుంభాభిషేకం, శాస్త్రోక పూజలు నిర్వహించారు. భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్ద ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు పీ.సురేంద్ర రెడ్డి మిడతల రమేష్ బిమెస్ రంగ రాజన్ కెవి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. తదుపరి టీవీఎస్ కళ్యాణ్ సదన్‌లో అన్నదానం నిర్వహించారు.

# 155 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలం గోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. ఆచార్య నాగేంద్ర కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణ సహాయకులు బి .గురువయ్య పాల్గొని 155 మంది విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురికి కంటి అద్దములు అవసరమని గుర్తించి త్వరలోనే ఉచితంగా కంటి అద్దములు అంద జేస్తామని గురువయ్య పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువయ్య మాట్లాడుతూ.. కంటి ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యమని మంచి పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ప్రధానంగా తాజా ఆకు కూరలు పాలు కోడిగుడ్డు క్యారెట్ చికెన్ చేపలు




తదితర ఏ విటమిన్ కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. విద్యా ర్థులకు కంటి వైద్య సేవలు అందించిన గురు వయ్యకు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎల్ హెచ్.పి.బి. హెప్సిబా, ఆరోగ్య కార్యకర్తలు యు.కృష్ణవేణి, ఆశాలు టి. భాగ్యమ్మ ఎన్. పార్వతి పాఠశాల ఉపాధ్యాయులు కె.పరంధామయ్య, బి. వెంకటేశ్వర్లు, జి.భాగ్యలక్ష్మి, ఎ.దేవి, కె.శేష గిరిరావు, కె.వెంకటేశ్వర్లు, వి.సుధాకర్, పి.అనిల్ కుమార్, షేక్. ఎం.గౌస్ మొహిద్దిన్, విద్యార్థులు, పాల్గొన్నారు.

# దేశం గర్వించదగ్గ గొప్ప ప్రజా నాయకుడు సీతారాం ఏచూరి



- ఆయన మరణంతో ప్రశ్నించే గొంతుకను కోల్పోయాం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జేఎన్‌యులో విద్యార్థి నాయకుడిగా మొదలై అంచలంచెలుగా అనేక పదవులను అలంకరించి కమ్యునిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవికే వన్నె తెచ్చిన నాయకుడు సీతారాం ఏచూరి అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి నష్టం కలిగించే ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకోవడంతోపాటు వాటి పట్ల ప్రజలను చైతన్య పరచడం కోసం అవిశ్రాంతంగా శ్రమించిన గొప్ప కమ్యూనిస్ట్ సీతారాం ఏచూరి అని, కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉద్యమ బలోపేతానికి సీతారాం ఏచూరి ఎంతో శ్రమించారు. మరెందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. రాజ్యాంగ హక్కుల సాధనకై, అణగారిన వర్గాల గొంతుకై నిలిచిన సీతారాం ఏచూరి తెలుగువాడు కావడం మనకెంతో గర్వకారణం. సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాదు, పేద, బడుగు బలహీన వర్గాలకు, దళిత వర్గాలకు సైతం తీరని లోటన్నారు. సీతారాం ఏచూరి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు.

# ఆదరణ కేంద్రంకి నిత్యావసర వస్తువుల వితరణ

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం నాగులవరం గ్రామవాసి కాంద్ర గంగినాయుడు కుమారుడు కాంద్ర సతీష్ నాయుడు మంగమూరు ఆదరణ కేంద్రంకు రూ.20వేల రూపాయల విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణగా ఇచ్చారు. గత మూడు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా ఆదరణ కేంద్రంకు నిత్యవసర వస్తువులను అందజేస్తున్నారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.సింహాద్రి రావు మాట్లాడుతూ.. సతీష్ నాయుడు అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, సతీష్ నాయడు ప్రతినెలా 1వ తేదిన మేము అడుగకుండానే సహాయం చేసే వ్యక్తి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సతీష్ నాయుడు దేవుడి లాగా వచ్చి ఆదరణ కేంద్రంలో మంచినీటి కోసం బోర్ వెల్ కూడ వేయించి అనాథ లకు మంచినీటి సదుపాయం కల్పించి ఆదుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్




నాయుడు పాలోవర్స్ ఆదరణ కేంద్ర డైరక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలం 'గిరి ప్రదక్షిణం' కి ప్రత్యేక బస్సు ఏర్పాటు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** అరుణాచలం గిరి ప్రదక్షణం వెళ్లే భక్తులకు గొప్ప సువర్ణ అవకాశం కల్పిస్తున్నట్లు ఏ పి ఎస్ ఆర్ టి సి రాపూరు డిపో మేనేజర్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.వివరాల మేరకు రాపూరు, పొదలకూరు కలువాయి, డక్కిలి మండల ప్రజలకు ఏపీఎస్ ఆర్టీసీ రాపూరు డిపో వారు 17.09.2024 ఉదయం 09.00ని లకు పొదలకూరు నుండి బస్సు బయలుదేరి రాపూరు, డక్కిలి మీదగా




అరుణాచలం వరకు (వయా సిరిపురం గోల్డెన్ టెంపుల్ ) స్పెషల్ టూర్ ప్యాకేజీ (యుపీ అండ్ డీఎన్) ద్వారా సూపర్ లగ్జరీ బస్సు ను ఏర్పాటు చేసి ఉన్నారు. కావున కలువాయి, పొదలకూరు, రాపూరు, డక్కిలి ప్రజలు www.apsrtconline.in నందు తమ ప్రాంతం నుండి అరుణాచలం వరకు 94206 సర్వీస్ నెం నందు రాను పోను టికెట్ ధర 1300/-తో తమ టికెట్స్ రిజర్వేషన్ చేసుకోవలెనని తెలిపారు. మరిన్ని వివరములకు ఫోన్ నెం : 7205593111, 7382886451కి ఫోన్ చేసి కనుక్కోవచ్చని తెలిపారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మహాజనసభ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు విషయాలను చర్చించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ రిజిస్టర్ మోషష్ అధ్యక్షతన కొన్ని అంశాలను తీర్మానించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిస్టిక్ కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ తిరుపాలయ్య హాజరయ్యారు. నెల్లూరు టౌన్ రామ్మూర్తి నగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, బాబు, మహేష్, సంఘం సీఈవో తుళ్లూరు మల్లికార్జునరావు, సంఘం సిబ్బంది సంగం సభ్యులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

# ఉత్తర కాలువకు నీళ్లు ఇవ్వాలి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల జలాశయం నుండి ఉత్తర కాలువకు నీటిని విడుదల చేయాలని అనంతసాగరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో వరద నీటి నిల్వ రాబోవు సీజన్ కంటే ముందుగా ఆశాజనకంగా ఉంది అన్నారు. పెన్నా డెల్టాకు, కండలేరు రిజర్వాయర్ కు వరద జలాలను పంపిణీ చేస్తున్న క్రమంలోనే ఉత్తర కాలువకు నీటి విడుదల చేపట్టాలని కోరారు. అనంతసాగరం, ఏఎస్ పేట, ఆత్మకూరు మండలాలకు కాలువ ద్వారా నీటి విడుదల ఆవశ్యకత ఉంది అన్నారు. మండలాల్లో చెరువులు ఇప్పటికే ఎండిపోయి దుర్భర పరిస్థితులను ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వరద జలాలను వృథాగా సముద్రపు పాలు చేసే కంటే ఆయకట్టుల రైతాంగ అవసరాలకు వాటిని వినియోగించుకోకపోవడం ఏమిటని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మంగళ పుల్లయ్య, మండల సిఐటియు కార్యదర్శి అన్వర్ బాషా, రైతు సంఘం నాయకులు ఉప్పలపాడు మస్తాన్, దాదా మస్తాన్, కాజా మొహిద్దిన్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# కడియాల సోమశేఖర్ రెడ్డికి సోమిరెడ్డి ఘన నివాళి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు రిపోర్టర్‌గా పనిచేస్తున్న తాటిపర్తి గ్రామానికి చెందిన కడియాల చిన్మయరెడ్డి (మారుతి) తండ్రి కడియాల సోమశేఖర్ రెడ్డి చిత్రపటానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాళి ర్పించారు. సోమశేఖర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం ఆయన పెద్దకర్మ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వారి స్వగృహానికి విచ్చేసి సోమశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుమారులైన కడియాల జగన్మోహన్ రెడ్డి, చిన్మయిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోమిరెడ్డి వెంట తాటిపర్తి టిడిపి నాయకులు హనుమారెడ్డి ,కసిరెడ్డిసుజిత్ రెడ్డి, కందే.మస్తానయ్య, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



# బడిబయట పిల్లలను రప్పించగలరా !



- అధికారికంగా జిల్లాలో 13604మంది
- నియోజకవర్గంలో 899మంది
- మండలంలో 182మంది



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** 14 సంవత్సరాలలోపు పిల్లలు విద్యాభ్యాసం చేయకుండా బడిబయట ఉండరాదని, బడిమానేసి డ్రాపవుట్స్‌గా ఉండరాదని, బాలకార్మికులుగా ఉండరాదని ప్రభుత్వం పదేపదే చెబుతుండడం, అందుకుతగిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండడం తెల్సిం దేకాగా ఇంకా పలువురు చిన్నారులు బడి బయట కన్పిస్తున్నారు. గత ప్రభుత్వం బడి బయట పిల్లలందరినీ బడులకు రప్పించాలని, 10వతరగతి ఫెయిల్ అయినవారిని మళ్ళీ అదే తరగతిచదివేలా పాఠశాలల్లో చేర్చాలని ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈమేరకు అధికారులు యత్నిస్తున్నారు. కానీ తగిన ఫలితం కాన రావడం లేదని బడిబయట ఇంకా కన్పి స్తున్న పిల్లలనుబట్టి విశదమవుతోంది. ఆత్మ కూరులో తరచూ పరిశీలిస్తుంటే సోమశిల రోడ్డు మార్గాన, బైపాస్‌రోడ్డు మార్గాన పదేళ్ళలోపు చిన్నారులు చెత్తకాగితాలు సేకరిస్తూ కన్పిస్తుంటారు. టీస్టాల్ వద్ద యాచిస్తూ కన్పిస్తుంటారు. వారిని బడికెళ్ళడంలేదా అని ప్రశ్నించినా, ఫోటోలు తీయబూనినా పరుగులెత్తుతున్నారు. వేసవిసెలవులనంతరం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా యత్నించి బడిఈడు చిన్నారులను పాఠశాలల్లో చేర్పించామని చెబుతున్నారు. గత విద్యా సంవత్సరంలో ఉన్నతాధికారులు అధికారికంగా జిల్లాలోని 37మండలాల్లో 13604 మంది డ్రాపవుట్స్ ఉన్నారని, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో 155మంది, అనంతసాగరం మండలంలో 126మంది, మర్రిపాడు మండలంలో 148మంది, చేజర్ల మండలంలో 205మంది, సంగం మండలంలో 177 మంది, ఏఎస్‌పేట మండలంలో 88మంది (మొత్తం 899) ఉన్నారని అధికారికంగా పేర్కొంటూ తగు చర్యలు తీసుకోవాలని ఆయా మండలస్థాయి అధికారులను ఆదేశించారు. అధికారికం గానే ఇంత మంది ఉన్నారంటే వాస్తవంగా ఇంకా అధికంగా ఉంటారని భావించాల్సి ఉంటుంది. సమాజంలో బడిమానేసిన, బడిబయట 14సంవత్సరాలలోపు వారుండ కుండేలా అలాంటి వారిని గుర్తించాలని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి రప్పిం చాలని ప్రభుత్వాలు భావిస్తూ ఆమేరకు ఆయా శాఖ అధికారులు, ఉపాధ్యాయులకు సూచించడంతోపాటు మళ్ళీబడికి, పోదాం బడికి, బడిబాట తదితర అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయినా సంపూర్ణంగా మార్పు కానరావడం లేదు. ఆరేడునెలల క్రితం జిల్లాలో బడిలోలేని చిన్నారులు 14634మంది ఉన్నారని, అందులో ఆత్మకూరు మండలానికి సంబంధించి పాఠశాలవారీగా పిల్లల పేర్లతో సహా 284మంది ఉన్నారంటూ 333పేజిల జాబితాను అన్నిమండలాలకు ఉన్నతాధికారులు పంపారు. అయితే వారంతా బడిమానేసిన, బడిబయట వారు కాదని, ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్నవారు, వివరాలు తెలియనివారు ఉన్నారని కూడా అందులో నమోదుచేస్తూ వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి నివేదించాలంటూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆమేరకు మండలాల అధికారులు విచారించి నివేదించారని తెలుస్తోంది. జిల్లాలో 899మందిగా నిర్ధారించారు. అయితే ఇంకా చెత్తకాగితాలు సేకరిస్తూ అధికారులకు కూడా కన్పిస్తున్నా ఎవరూ అలాంటివారి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. బడిమానేసిన, బడిబయట పిల్లలును బడికి రప్పించేందుకు తగిన విధంగా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు యత్నించాల్సి ఉంది. బాలకార్మికులంటే విద్యాశాఖ, రెవిన్యూ, పోలీస్‌శాఖలు గుర్తించి బాలకార్మికవ్యవస్థ నిరోధక చట్టాలద్వారా కేసులు నమోదుచేసి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎక్కడా కేసులునమోదుచేసిన దాఖలాలు లేవు. బడిబయట ఉన్నవారిని మాత్రం తప్పకుండా ఏదో ఒక పాఠశాలకు రప్పించేలా మాత్రం యత్నించాల్సి ఉంది. గతంలో బడిబయటపిల్లలు, బడిమానేసిన పిల్లలు 14సంవత్సరాలలోపు వారిని తప్పకుండా చదివించాల్సిన తప్పనిసరి విధానం అమలుచేస్తూ రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ బ్రిడ్జికోర్సుసెంటర్లు కూడా నిర్వహించారు. విరివిగా అందుబాటులో ప్రాథమికోన్నత పాఠశాలలను కూడా ప్రారంభించారు. తాజాగాకూడా బడిబయటపిల్లల కోసం నాన్‌రెసిడెన్షియల్ స్పెషల్‌ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటుచేయనున్నామని, అందుకుగాను నెల్లూరుజిల్లాలో 42కేంద్రాలను ప్రతిపాదించామని, 42మంది వాలెంటీర్లను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రసమగ్రశిక్షఅభియాన్ ప్రాజెక్టుడైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ ఈమేరకు గతజూలై21వతేదీన ఉత్తర్వులిచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మకూరు పట్టణం, మండలంలోని గ్రామాల్లో బడిబయట పిల్లలు, బడిమానేసిన పిల్లల విషయమై సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రోడ్లపై చిత్తుకాగితాలు సేకరించేవారు అధికారులకు కన్పించడం లేదా, కాస్తంత నిఘా ఉంచితే కన్పిస్తారు , వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమన్వయంచేసి బడికి రప్పించాలికదా అని కూడా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా ఇటీవల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుండగా ఆత్మకూరు అర్బన్,రూరల్‌మండలంలో 182మంది బడిబయట పిల్లలున్నారని, వారిని బడికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎంయివోలు చెబుతుంటారు. గత ఏడాది తీవ్ర ప్రయత్నం జరుగగా ఇంకా 182మంది బడిబయట పిల్లలున్నారని అప్పటి ఎంయివో తెలిపారు. ఈపరిస్థితి ఏమిటి, నిజంగా బడిబయట పిల్లలందరినీ బడికిరప్పించేలా యత్నిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి అందరినీ బడిబయట పిల్లలను బడికి రప్పించేలా ఏదేని ప్రత్యేక చర్యలు తీసుకుంటారేమో, ఉన్నతాధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

---

## దళితులపై దాడిని ఖండించిన కాకాణి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలం, ముత్తుకూరు గ్రామంలోని పాతహరిజనవాడకు చెందిన యువకులను చితకబాది, చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై వెంటనే చర్యలు చేపట్టాలి. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పార్టీలకతీతంగా దాడులకు గురైన దళిత కుటుంబాలకు అన్ని విధాల అండగా నిలుస్తామని, ప్రజల ఆశీస్సులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులైన పోలీసులు అందరినీ శాశ్వతంగా ఉద్యోగాల నుండి తొలగిస్తాం (డిస్మిస్ చేయిస్తాం). సర్వేపల్లిలో గెలిచిన ఓడిన నా ప్రయాణం.. మీ ఇంటి బిడ్డగా.. సర్వేపల్లి ప్రజల వెంటే ఉంటానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ అన్నారు.

## అత్యాచార బాధితులు కోసం మరిన్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అవసరం


**- ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** మన దేశంలో రోజు రోజుకు ఆడపిల్లలపైన అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయి కావున బాధితులుకు అండగా వారి సమస్యలు త్వరగా పరిష్కారం అవడం కోసం రాష్ట్రంలో కేటాయించిన ఎఫ్.టి.ఎస్.సి లను కార్యాచరణలోకి తీసుకురావాలని ప్రగతి సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం ఉన్న కేసులు రేటు ప్రకారం డిసెంబర్ 2023 నాటికి బ్యాక్‌లాగ్‌ను తొలగించడానికి దేశంలో ప్రతి మూడు నిమిషాలకు కనీసం ఒక అత్యాచారం లేదా పోక్సో కేసును క్లియర్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. అత్యాచార బాధితులకు సకాలంలో న్యాయం చేకూర్చడానికి ప్రతి జిల్లాకు ఒక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రగతి సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. అత్యాచారం లైంగిక వేధింపులుకి గురి అయిన వారికి సత్వర న్యాయం పొందేందుకు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులు ఎఫ్‌టిఎస్‌సిలు మాత్రమే మార్గమని ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ యొక్క ఇటీవలి నివేదిక సూచిస్తుంది. ప్రస్తుత కాలంలో పెరు గుతున్న కేసులను బట్టి మరిన్ని ఎఫ్‌టిఎస్‌సిలు ఏర్పాటు చేయ బదేలా చూడాలని ఈ అదనపు ఎఫ్‌టిఎస్ సిలు లేకుండా దేశంలో పెండింగ్‌లో ఉన్న అత్యాచారం పోక్సో కేసులు బ్యాక్‌లాగ్‌ను ఎప్పటికీ క్లియర్ చేయలేకపోవచ్చని నివేదిక హెచ్చరించింది. ఫాస్ట్ ట్రాకింగ్ జస్టిస్ కేసులు తగ్గించడంలో ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టుల పాత్ర' అనే నివేదిక, 2022లో దేశంలోని అన్ని కోర్టులలో అత్యాచారం మరియు పోక్సో కేసులు తీసివేయడంలో కేవలం 10 శాతం అయితే చాలా ఎక్కువ ముఖ్య పాత్ర చూపించాయని హైలైట్ చేసింది. 83 శాతం వద్ద, 2023లో 94కి మరింత మెరుగుపడుతుంది. బ్యాక్‌లాగ్‌ను క్లియర్ చేయడానికి మరో 1000 ఏర్పాటు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది. నిర్భయ ఫండ్‌లో ఉపయోగించని మొత్తం ఈ అదనపు కోర్టులు నిర్వహణకు రాబోయే రెండేళ్లపాటు సరిపోతుందని పేర్కొంది. ఎఫ్‌టిఎస్‌సిలలో ప్రస్తుతం ఉన్న 202,175 రేప్ పోక్సో కేసులను క్లియర్ చేయడానికి భారతదేశానికి సుమారు మూడు సంవత్సరాలు పడుతుందని నివేదిక హెచ్చరించింది. ఇది తక్షణమే మొత్తం 1,023 క్రియాత్మకం చేయాలని దేశవ్యా ప్తంగా మరో 1,000 ఏర్పాటు చేయాలని సిఫార్సు చేస్తోంది. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు బ్యాక్‌లాగ్ క్లియరింగ్‌ను ఎలా వేగవంతం చేస్తాయో నివేదిక చూపిస్తుంది ఎఫ్ఠ ఎస్సీ ప్రవేశపెట్టినప్పటి నుండి, 416,638 కేసులలో మొత్తం 214,463 పరిష్కరించబడ్డాయి. మహారాష్ట్ర 80 శాతం, పంజాబ్ 71 శాతం కేసుల పరిష్కారాలలో అధిక రేట్లు చూపించగా, పశ్చిమ బెంగాల్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో అత్యల్పంగా 2 శాతం నమోదు చేసింది.

## 14న జిల్లా జైల్‌ను సందర్శించనున్న ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జాతీయ మహిళా కమిషన్ ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి నెల్లూరు జిల్లా జైల్‌ను సందర్శించనున్నారు. జాతీయ మహిళా కమిషన్ వారు జైల్లో మహిళా ఖైదీల యొక్క సౌకర్యార్థం ఆ జైల్‌లోని వసతి సౌకర్యాలను పర్యవేక్షించవలసిందిగా ఆదేశిం చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి 14వ తేదీన నెల్లూరు జైలు సందర్శించనున్నారు. కావున జిల్లాకు సంబంధించిన బాధిత మహిళలు మధ్యాహ్నం 2 నుంచి 3గంటల మధ్య మహిళా కమిషన్ చైర్పర్సన్‌ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఈ అవకాశాన్ని స్థానిక మహిళలు ఉపయోగించుకోవాలని కోరడమైనది.

## ఘనంగా చిరాగా ఉత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలో జరుగుతున్న దొరసానమ్మ గంధోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చిరాగ దీపారాధన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దర్గా సజ్జదా నషీన్ హాఫీస్ పాషా ఆధ్వర్యంలో దర్గా ఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు అలాగే వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈవో హుస్సేన్ కోనేరు చుట్టూఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు.

# వైసీపీ ఐదేళ్ల పాలనలో అస్తవ్యస్త విధానాలు..

▶ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



పొదలకూరు, మేజర్‌న్యూస్ : వైసీపీ ఐదేళ్ల పాలనలో అస్తవ్యస్త విధానాలు, దోపిడీతో ఏపీని అన్ని రకాలుగా దివాళా తీయించారని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం సూరాయ పాలెం ఇసుక రీచ్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్రకతి విపత్తులను సైతం ఎదుర్కొని మూడు నెలల్లోనే శభాష్ అనిపించుకుంటూ పాలన సాగిస్తున్న చంద్రబాబు నాయుడిని చూసి జగన్మోహన్ రెడ్డి నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.గతంలో విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులని ఫోర్జరీ డాక్యమెంట్లు తెచ్చావ్.. ఈ రోజుకీ ఆ కేసు విషయంలో కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. ఇప్పుడేమో సూరాయపాళెం రీచ్‌లో ఒక్క ట్రాక్టర్ ఇసుక తోలకుండానే రూ.100కోట్ల దోపిడీ అంటున్నాడని విమర్శించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డికి రాత్రి పూట కలలు ఎక్కువగా వస్తున్నట్టున్నాయ్.. ఐదేళ్లుగా తాను చేసినట్టే అందరూ అక్రమాలు చేస్తారని కలలు కంటూ గడిపేస్తున్నాడన్నారు. ఆయనకు ఇంగిత జానం ఉన్నా, నిఖార్సైన రాజకీయ నాయకుడైనా సూరాయపాళెం రీచ్ వద్దకు రావాలని.. రూ.100 కోట్లు సోమిరెడ్డి తినేశాడని ఆధారాలు చూపించాలన్నారు. ఇకపై ఆయన కాకాణి గోవర్ధన్ రెడ్డి కాదని, సోషల్ మీడియా గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పైసా ఖర్చు లేకుండా ఇంట్లో కూర్చుని, ఒక కెమెరా పెట్టుకుని ఇష్టం వచ్చిన వీడియోలు పెట్టుకుంటున్నాడన్నారు. చంద్రమోహన్ రెడ్డి నుంచి చంద్రబాబు నాయుడు వరకు, నారా లోకేష్ బాబు నుంచి పవన్ కళ్యాణ్ వరకు అందరిపై ఇష్టారీతిగా విమర్శలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నాడన్నారు. అసలు సర్వేపల్లిలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దోచుకునేందుకు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఏమి మిగిల్చాడని, అంతా దోచేసుకుని ఇప్పుడు దోచుకుంటున్నారు. దాచుకుంటున్నారు అని గగ్గోలు పెట్టడానికి అసలు ఇక్కడ ఏముందన్నారు.అధికారం పోయిన తెల్లారి నుంచి తన ఇంటి ముందు పోలీసు సైరన్లు లేవని, సెల్యూట్లు లేవని, జనం లేరని, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేటోళ్లు రావడం లేదని బాధపడిపోతున్నాడని కాకాణిని దుయ్యబట్టారు.

## రూ.10.60 కోట్ల విలువైన ఇసుకలో రూ.100 కోట్ల దోపిడీనా ఎలా వీలవుతుంది ? : టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్..

ప్రజలు ఇబ్బంది పడకూదనే ఉద్దేశంతో అత్యవసర ప్రాతిపదికన డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారని, రూ.10.60 కోట్ల విలువైన ఇసుకలో రూ.100 కోట్ల దోపిడీనా ఎలా వీలవుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. గురువారం సూరాయ పాలెం ఇసుక రీచ్ వద్ద సోమిరెడ్డి కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రొక్లెయిన్లతో అడ్డగోలుగా తవ్వి తోలుకోవడం కాదు..బోట్ల ద్వారా డ్రెడ్జింగ్ తీసి ఇసుకను అందుబాటులోకి ఉంచుతామన్నారు.సూరాయపాళెం రీచ్ ద్వారా ప్రజలకు 8 లక్షల టన్నుల ఇసుక సరఫరాకు అనుమతి ఇచ్చారని, ఈ ఇసుక విలువ రూ.10.60 కోట్లు అని తెలిపారు. రూ.10.60కోట్ల విలువైన ఇసుకలో రూ.100కోట్ల దోపిడీనా ఎలా వీలవుతుందన్నారు. రాష్ట్రంలోనే అతి తక్కువ ధరకు సూరాయపాళెం రీచ్‌లో డ్రెడ్జింగ్ చేయబోతున్నందుకు అభినందించాల్సిందిపోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేజీఎఫ్-1, కేజీఎప్-2, కేజీఎఫ్-3 తరహాలో ఈ ప్రాంతంలోని సహజ వనరులు మొత్తాన్ని ఆయన కొల్లగొట్టేశాడన్నారు. జేబులోకి వస్తే మాటుండదు. కడుపులోకి పోతే సౌండ్ ఉండదనేలా ఉంది గోవర్ధన్ రెడ్డి పరిస్థితి ఉందన్నారు.ఇసుక రీచ్‌ల నిర్వహణ ఆషామాషీగా ఉండదని, 24/7 లైవ్ సర్వైలెన్స్‌తో పర్యవేక్షిస్తారన్నారు. ఇంత సమగ్రమైన వ్యవస్థతో ఇసుక పాలసీ వస్తుంటే.. దోపిడీ.. దోపిడీ అని విమర్శలు చేయడం దురదష్టకరమన్నారు. వరదల గురించి కూడా గోవర్ధన్ రెడ్డి కామెంట్ చేయడం సిగ్గు చేటు తెలిపారు. కనీసం విజయవాడ వైపే వెళ్లకుండా ఇక్కడ కూర్చుని నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విజయవాడకు వెళ్లి పలు కంపెనీల ప్రతినిధులతో రూ.2.97 కోట్ల సాయం ఇప్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.




# ఈనెల 14న కోవూరు యువతకై జాబ్ మేళా

- జాబ్ మేళాలో 32 కంపెనీలు పాల్గొంటాయి..
- 10 నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ దాకా అర్హులే..
- రిక్రూట్ అయ్యే యువకులకు 1.65 లక్షల నుంచి 5.7 లక్షల వార్షిక వేతనం
- జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, అమర్ రాజ, ఎంఆర్‌ఎఫ్ టైర్స్, రిలియన్స్, అపోలో ప్రతినిధులు
- కోవూరు నియోజకవర్గ యువకులకు తొలి ప్రాధాన్యత



నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : యువతకు ఉపాధి కల్పిస్తామన్న ఎన్నికల హామీల అమలులో భాగంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 14న (శనివారం) కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. టెక్ మహేంద్ర, అమర్ రాజ, ఎంఆర్‌ఎఫ్ టైర్స్, రిలియన్స్, అపోలో, హెటెరో డ్రగ్స్, పేటిఎం లాంటి 32 పారిశ్రామిక, ఫార్మా, సాఫ్ట్ వేర్ సంస్థల ప్రతినిధులు ఈ జాబ్ మేళా ద్వారా రిక్రూట్మెంట్ చేస్తారని తెలిపారు. 10వ తరగతి మొదలు ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదివిన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో ఎంపిక అయ్యే అభ్యర్థుల విద్యార్హతను బట్టి సంవత్సరానికి 1.65 లక్షల నుంచి 5.7 లక్షల వార్షిక వేతనం లభించే అవకాశముందన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా రిక్రూట్ అయ్యే యువకులు నెల్లూరు, తిరుపతి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు విధి నిర్వహణ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే యువకులు విద్యార్హతకు సంబంధించిన 8సెట్ల సర్టిఫికేట్లు తీసుకురావాలన్నారు. కోవూరు నియోజకవర్గ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగ పరుచుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, టీడీపీ నాయకులు చెంచు కిషోర్ యాదవ్, బెజవాడ వంశి కృష్ణా రెడ్డి, బత్తుల హరికృష్ణ, జెట్టి రాజశేఖర్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూర్య www.suryaa.com



రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, దుత్తలూరు, కొండాపురం, బుచ్చి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1,
LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు.
సెల్: 9000 118811


# లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్ పై సమీక్ష



ముత్తుకూరు, మేజర్‌న్యూస్ : లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం పై సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పనా శైల సమీక్ష చేశారు. ఈ సమీక్ష గురువారం బ్రహ్మదేవం జడ్పీ హైస్కూల్ నందు జరిగింది. ఇప్పటివరకు ప్రగతిని గురించి సమీక్ష చేశారు. సమగ్ర శిక్ష, బాల రక్షా భారత్ అండ్ ఎస్‌సిఐఎల్ ఆధ్వర్యంలో తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పై ఆమె క్షేత్రస్థాయిలో చర్చించారు. టీచర్స్‌తో సమగ్రంగా మాట్లాడారు. తరగతి గది పాఠ్యాంశాలను బోధన విధానాలను లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రా యొక్క బోధన వ్యూహాలతో పాఠ్యంశ బోధన ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. టీచర్స్‌కు సలహాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులతో మాట్లాడి ఈ కార్యక్రమం యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎంఓ సుధీర్ బాబు, బాల రక్షా భారత్ ప్రతినిధి రఫీ, మండల విద్యాశాఖ అధికారులు మధుసూదన్, హేమ సుందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దొరసానమ్మ గంధమహోత్సవం



అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ : మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని హబీబా ఖాతూన్ అమ్మవారి (దొరసానమ్మ) 251వ గంధ మహోత్సవం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆదేశాల మేరకు దర్గా ఈవో షేక్ మొహ మ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దర్గా వంశస్థుడు ఫయాజ్ అహ్మద్ గంధ కలశంలో గంధాన్ని సుగంధ ద్రవ్యాలు అత్తరు పన్నీరులతో కలిపి అనంతరం గంధ కలశమును తలపై ఉంచుకొని మహల్ నుండి బయలుదేరి మేళా తాళాలతో ఫకీరుల జరబులతో బాణాసంచా కాలుస్తూ భక్తి కీర్తనలు పాడుతూ భక్తజన సందోహం నడుమ హజ్రత్ వారి దర్గాకు చేర్చారు హజరత్ అమ్మవార్ల సమాధులకు గంధ లేపనం చేసి ప్రత్యేక ఫాతిహా చదివి సలాములు పాడారు. అనంతరం గంధ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో మరో 20 బిందెలు గంధమును కలిపి భక్తులకు పంచి పెట్టారు గంధ మహోత్సవం సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ఆత్మకూరు డిఎస్పీకే వేణుగోపాల్, సంగం, ఆత్మకూరు సీఐలు వేమారెడ్డి, గంగాధరరావు, పేట ఎస్ఐ సైదులు పర్యవేక్షణలో సుమారు 100 మందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా అసిస్టెంట్ ఈవో షేక్ షరీఫ్, వక్ఫ్ బోర్డ్ ఇన్స్‌ఫెక్టర్లు ఖుదావన్, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.